క్లుప్తంగా

నేడు బలరామ జయంతి

సీటీఆర్ఐ: స్థానిక గౌతమ ఘాట్‌లోని ఇస్కాన్ మందిరంలో గురువారం నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకూ శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ హెచ్‌జీ శ్యామాంగ శ్రీనివాస్ దాస్ చెప్పారు. ఇస్కాన్ మందిరంలో హేమంత్ ప్రభు, శ్రీహరి తదితరులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. బలరామ జయంతి సందర్భంగా గురువారం ఉదయం 11 గంటలకు జగన్నాథ, బలదేవ, సుభద్రాదేవికి మహాకుంభాభిషేకం నిర్వహిస్తామని, 12 గంటలకు ప్రవచనం, అనంతరం మహా హారతి, మహాప్రసాద వితరణ ఉంటాయన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాల్లో భాగంగా నిత్యం సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 7 ఉదయం 9 గంటలకు యజ్ఞ సేవ, అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రదానం, మధ్యాహ్నం 3 గంటలకు ఉట్టి ఉత్సవం, సాయంత్రం ఆరు గంటలకు తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నూజిళ్ల శ్రీనివాస్‌కు సత్కారం

సీటీఆర్ఐ: నగరానికి చెందిన రచయిత, మేము గోదారోళ్లమండీ పాట ద్వారా గోదారోళ్ల వ్యక్తిత్వాన్ని, అనుబంధాలు, ఆప్యాయతలను విశ్వవ్యాప్తం చేసిన నూజిళ్ల శ్రీనివాస్‌కు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరులో ఘన సన్మానం జరిగింది. ఆయన ఇంగ్లిషు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పనిచేస్తున్నారు. తెలుగు భాషపై ఉన్న మక్కువతో అనేక రచనలు చేస్తున్న నూజిళ్ల శ్రీనివాస్‌ను సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఘనంగా సన్మానించింది.

వైఎస్సార్ బీమా పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 31వ డివిజన్ మదన్‌సింగ్‌పేటలో హుస్సేన్ అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.పదివేలు అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం మాట్లాడుతూ మిగిలిన బీమా సొమ్ము నేరుగా బ్యాంకుఖాతాలో జమ అవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ చైర్మన్ మజ్జి అప్పారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ధర్నా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎల్ఐసీ ఉద్యోగులకు వేతన సవరణను తక్షణమే అమలు చేయాలని, నూతన పింఛన్ పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ బుధవారం మోరంపూడిలోని ఎల్ఐసి డివిజన్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. నిరసనలో పి.సతీష్, గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్, అశోక్, ప్రసాద్, గన్నెయ్య, విశ్వనాథ్, శిరీష పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల ధర్నా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర ప్రభుత్వం ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు కార్డు 2.0 పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు ఆందోళన చేపట్టారు. దీనిలో భాగంగా బుధవారం రాజమహేంద్రవరం జిల్లా దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సాయికృష్ణా థియేటర్ వద్ద నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.



సుస్వాగతం : కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహానికి బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, రాఖీ కడుతున్న రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి. - రాజమహేంద్రవరం సిటీ

సోదర ప్రేమకు ప్రతిరూపం రాఖీ



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- ఎంపీ భరత్ రామ్
- ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



రాఖీ ఆకారంలో నిలబడిన విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: సోదర ప్రేమకు ప్రతిరూపం రాఖీ అని ఎంపీ భరత్ రామ్ అన్నారు. స్థానిక 42వ డివిజన్ మున్సిపల్ కాలనీలోని మున్సిపల్ పార్కులో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాధిక దంపతుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ ఒక్క అన్నలా అండగా ఉంటూ, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఇంత చక్కని కార్యక్రమం నిర్వహించిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దంపతులను అభినందించారు. రాజమహేంద్రి ఉమెన్స్ కళాశాల విద్యార్థినులు రాఖీ ఆకారంలో నిలబడి విన్యాసం చేశారు. సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రానికి రక్ష జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రక్షాబంధన్ రోజున జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, 42వ డివిజన్ ఇన్‌చార్జి నామన వాసు, పోలు విజయలక్ష్మి, బర్రే కొండబాబు, కాటం రజనీకాంత్, అరిగెల బాబు పాల్గొన్నారు.



కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో..

కంబాలచెరువు: కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో బుధవారం రాఖీ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు పులుగుర్త దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సోదర ప్రేమను చాటిచెప్పే గొప్ప పండగ రక్షాబంధన్ అన్నారు. ఉపాధ్యాయులు మల్లిపూడి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటి ముంగిటకే పథకాలు

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..



ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారుల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు వచ్చి చేరుతున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 39వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి లంక ప్రసాద్ ఆధ్వర్యంలో లింగంపేట, కృష్ణానగర్ ప్రాంతాలలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడారు. పలువురు డ్రైనేజీ సమస్యపై ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించారు. అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, కోటి లింగేశ్వర స్వామి ట్రస్ట్ కమిటీ చైర్మన్ అరిగెల బాబు, సచివాలయ కన్వీనర్ మధు, సచివాలయ వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల్లో సోదరభావం పెంపొందించాలి

కంబాలచెరువు: బాలల్లో దేశభక్తి, సోదరభావం పెంపొందేలా ఉపాధ్యాయులు పలు కార్యక్రమాలు, పోటీలు నిర్వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నన్నయ మున్సిపల్ హైస్కూల్, టౌన్ హైస్కూల్, కంటిపూడి రామారావు మున్సిపల్ హైస్కూళ్లలో నల్సా 'బాలల స్నేహపూర్వక న్యాయ సేవలు, వారి సంరక్షణ పథకం, 2015'పై ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో మాట్లాడారు. తోటి విద్యార్థులతో సోదరభావం కలిగి ఉండాలన్నారు.

ఓటర్ల వివరాల నమోదు పూర్తి చేయాలి



కోట సత్యవతి ఓటును తనిఖీ చేస్తున్న జేసీ తేజ్ భరత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇంటింటి సర్వే ద్వారా గుర్తించిన ఓటర్ల చేర్పులు, తొలగింపుల పూర్తి డేటా ఎంట్రీ గురువారానికి పూర్తి చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. నియోజకవర్గంలోని 152 పోలింగ్ కేంద్రం పరిధిలో నూతనంగా నమోదు చేసిన, తొలగించిన ఓటరు వివరాలను బుధవారం ఉదయం స్థానిక ఇన్నీసు పేటలో క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మృతుల తొలగింపు, చిరునామా మార్పులు, 80 ప్లస్ ఓటర్ల గుర్తింపు, యువ ఓటర్లు నమోదుపై మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. తనిఖీలో భాగంగా 82 ఏళ్ల కోట సత్యవతి ఎపిక్-జేఆర్‌హెచ్ 1942325ను పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల గుర్తింపుపై ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని బూత్ లెవల్ అధికారుల ద్వారా చేపట్టినట్లు తెలిపారు. రూరల్ తహసీల్దార్ పైడి చిన్నారావు, డిప్యూటీ తహసీల్దార్ ఎం.కృష్ణసుధీర్, బీఎల్‌వో బీవీఎస్ హరిప్రియ పాల్గొన్నారు.

7న వ్యూహలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్నవెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠంలో సెప్టెంబర్ ఏడో తేదీ ఉదయం 11.58 గంటలకు వ్యూహాలక్ష్మి అమ్మవారి నూతన పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని పీఠాధిపతి డాక్టర్ శ్రీమాన్ చిన్నవెంకన్న బాబు స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం దానవాయిపేటలోని ట్రస్టు కార్యాలయంలో సుమేధ వెంకటరాజుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. చిన్న వెంకన్న బాబు మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు 12 గంటల పాటు నిర్విరామంగా వ్యూహలక్ష్మికి, వారాహి అమ్మవారికి హోమం నిర్వహిస్తామన్నారు. తిరుమల క్షేత్రంలోని శ్రీవారి వక్షస్థలంలో కొలువైన శక్తి స్వరూపం వ్యూహాలక్ష్మీదేవి అన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మనగుడి, మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి జాతీయ చైర్మన్ ధరణికోట దుర్గావెంకట హేమావతి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, వైస్ చైర్మన్ టీవీ అప్పారావు, భాష్యం ప్రిన్సిపల్ ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: ఫ్లెక్సీ కడుతుండగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగలడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం ఆర్యాపురంలోని లింగంపేటకు చెందిన సోమల వీరబాబు (39) కూలి పనులు చేస్తుంటాడు. బుధవారం దివాన్ చెరువు జాతీయ రహదారిపై ఓ ప్రైవేటు స్కూల్‌కు సంబంధించి భవనంపై హోర్డింగ్‌కు ఫ్లెక్స్ కట్టేందుకు స్నేహితుడు నాగరాజుతో కలిసి అక్కడకు వచ్చాడు. ఈ నేపథ్యంలో ఫెక్సీ కడుతూ పైనుంచి వెళుతున్న 11 కేవీ విద్యుత్ హైటెన్షన్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందాడు. వీరబాబు భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జగన్ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరబాబుకు భార్య ఆదిలక్ష్మి, ఒకపాప, బాబు సంతానం. భార్యాభర్తలు ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు.

బంగారుకొండల ఆరోగ్యంపై ఆరా

రాజమహేంద్రవరం సిటీ: బంగారుకొండ పథకంలో పోషకాహార లోపం గల పిల్లలను దత్తత తీసుకుని పౌష్టికాహారాన్ని అందిస్తున్న బాలమిత్రలు.. ప్రతి బుధవారం వారి వద్దకు వెళ్లి బాగోగులు చూడాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. ఆయన దత్తత తీసుకున్న షేక్ ఫారూక్‌ను చూసేందుకు బుధవారం గోరక్షణపేటలోని బాలుడి ఇంటికి వెళ్లారు. అతడి తల్లితండ్రులతో మాట్లాడుతూ పౌష్టికాహార కిట్‌లోని పదార్థాలను తప్పనిసరి ఉపయోగించాలన్నారు. గోపాల్ నగర్ పుంతలోని కొవ్వాడ దీక్షిత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

మహిళకు అంత్యక్రియలు

ప్రకాశం నగర్: లాలాచెరువు ప్రాంతానికి చెందిన కోనేటి సత్యవేణి అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. ఈ విషయాన్ని స్థానికుడైన జిమ్ కిరణ్ సహకారంతో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు. ఆమె వెంటనే స్పందించి జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ట్రస్టీ పట్నాయక్ పర్యవేక్షణలో జక్కంపూడి ఫౌండేషన్ కైవల్య రథం ద్వారా మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

లారీ ఢీకొని మున్సిపల్ వర్కర్ మృతి

కంబాలచెరువు: మంగళవారపు పేటకు చెందిన ఆకుల అప్పారావు (55) మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదిన వాటర్ వర్క్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. బుధవారం లలితానగర్ ఈఎస్ఐ ఆసుపత్రి రోడ్డులో తన బైక్‌పై వెళుతుండగా లారీ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు పట్టుకున్నారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.